క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



సాయిబాబా ఆలయంలో సామూహిక సత్యవ్రతాలను నిర్వహిస్తున్న భక్తులు

సాక్షి, భీమవరం: స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీవెంకట సాయిబాబా మందిరంలో మంగళవారం విజయదశమి, ఏకాదశి సందర్భంగా సాయిబాబా 105వ సమాధి పుణ్యతిథి ఉత్సవాన్ని ఆలయ నిర్మాణకర్త మల్లినీడి తిరుమలరావు(బాబి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా బాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, అనంతరం భక్తులతో సామూహికంగా శ్రీసాయి సత్యవ్రతాలు నిర్వహించారు. అలాగే బాబా దివ్య సమాధి పూజ, సామూహిక సహస్ర దీపోత్సవం, పల్లకి ఉత్సవాలను ఆలయ అర్చకుడు పి.నారాయణ శేషుకుమారాచార్యులు నేతృత్వంలో చేశారు. కార్యక్రమంలో మల్లినీడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ డివిజన్ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

సాక్షి, భీమవరం: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లాలోని మూడు డివిజన్ల మహాసభలు నవంబర్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి తెలిపారు. భీమవరంలో మంగళవారం జిల్లా సమితి సమావేశం భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరు నాటికి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అనుబంధ సంఘాలు. రైతు సంఘం, మహిళా సంఘం, విద్యార్థి సంఘం, మహాసభలు జరుపుతామన్నారు. ఈ సమావేశంలో కనుమూరు వెంకటపతి రాజు, తిరుమాని వనమ రాజు, దుగ్గిరాల శ్రీనివాస్, వాటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

పాలకోడేరు: విధి నిర్వహణలో అసువులు బాసిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబాన్ని భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ మంగళవారం పరామర్శించారు. వేంద్ర గ్రామానికి చెందిన పాలా వరప్రసాద్ పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తూ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందారు. మృతుని భార్యను డీఎస్పీ పరామర్శించి అండగా ఉంటామని, డెత్ బెనిఫిట్స్ అన్ని సకాలంలో వచ్చేలా చూస్తానని తెలిపరాఉ. కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పిస్తానని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఆయన వెంట భీమవరం రూరల్ సీఐ సత్య కిషోర్, ఎస్సై నాళం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు


మొక్కు తీర్చుకున్న సీఎం జగన్ అభిమాని



సత్తారామేశ్వరంలో శూలాలు ధరించి రథం లాగుతున్న తమనంపూడి నాగిరెడ్డి

పెనుమంట్ర: సత్తారామేశ్వరంలో శ్రీవిజయ దుర్గ ఆలయం వద్దసోమవారం పలువురు భవానీ భక్తులు శూలాలు సంబరం నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతీ ఏటా భవానీ భక్తులు తమ కోరికలు ఫలిస్తే అమ్మవారికి శూలాల సంబరం నిర్వహిస్తామని మొక్కుకుంటారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటి అధ్యక్షుడు తమనంపూడి అయ్యప్పరెడ్డి సోదరుడు తమనంపూడి నాగిరెడ్డి జగనన్న ఐదేళ్ల పూర్తిగా కొనసాగాలని కోరుకున్న మొక్కును సోమవారం శూలం ధరించి రథం లాగడం ద్వారా తీర్చుకున్నాడు. కార్యక్రమాన్ని ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి ప్రారంభించారు.

జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన



కొత్తపేటలో జలజీవన్‌మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: జలజీవన్ మిషన్‌లో మంజూరైన రూ.24లక్షల విలువైన పనులకు సర్పంచ్ కవురు భారతి శంకుస్థాపన చేశారు. మండలంలోని కొత్తపేట పంచాయతీలో మంగళవారం పైపులైన్ విస్తరణ, సంపు, ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులకు సర్పంచ్ భారతి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, కవురు భాస్కరబాబు, ఏఈ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా మహోత్సవాలు

- వైభవంగా దుర్గమ్మకు పూజలు
- గ్రామాల్లో సందడి వాతావరణం



భీమవరం(ప్రకాశం చౌక్): నాచువారి సెంటర్‌లో మహిషాసురమర్దని అలంకరణ



భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న మార్వాడీ సమాజ్ సభ్యులు



భీమవరం(ప్రకాశం చౌక్): శాంతాదేవి అలంకరణలో వాసవీ మాత



భీమవరం అర్బన్: రాయలంలో కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్



ఆకివీడు: వనువులమ్మ వారి ఆలయంలో శమీ పూజ చేస్తున్న దృశ్యం



కాళ్ల: మాలవానితిప్ప గ్రామంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భవానీ మాలధారులు

భీమవరం(ప్రకాశం చౌక్): దసరా మహోత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. 9వ రోజు అమ్మవార్లు రాజరాజేశ్వరి, దుర్గా దేవిగా ప్రత్యేక పూజలు అందుకున్నారు. భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవినవరాత్రుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9వరోజు అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక అలంకరణ పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. విజయ దశమిని పురస్కరించుకుని శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ గ్రంధి శ్రీనివాస్‌కు వేద ఆశీర్వాదం అందించారు. ఆలయ అధికారులు, ధర్మకర్తలు ఆయనను సత్కరించి అమ్మవారికి ప్రసాదాలు అందజేశారు. పంచారామక్షేత్రంలో దేవినవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో కొలువైన శ్రీపార్వతి దేవి అమ్మవారిని తొమ్మిదో రోజు వనదుర్గాదేవి అలంకరించి పూజలు నిర్వహించారు. ఏర్పట్లను ఆలయ కార్యనిర్వహణ అధికారి డి. రామకృష్ణంరాజు పర్యవేక్షించారు. నాచువారి సెంటర్లోని శ్రీకనక దుర్గమ్మవారు దేవి నవరాత్రి మహోత్సవాల్లో 9వ రోజు అమ్మవారికి మహిషాసురమర్దనిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పవన్, నిర్వాహకులు ఒంటిద్దు బళ్ల సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. త్యాగరాజ భవనంలోని శ్రీవాసవీ అమ్మవారు శాంతాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రాష్ట్ర ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణ మార్వాడి సమాజ్ వారి ఆధ్వర్యంలో చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే విధంగా మార్వాడీలు ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా మార్వాడి సమాజ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మార్వాడి సమాజ సభ్యులతో కలిసి రాజస్థానీ సాంప్రదాయమైన దాండియా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య , జైన్ యూత్ సంఘం నాయకులు హష్మక్ లాల్ జైన్, ప్రకాష్ జైన్, మార్వాడి సమాజ్ నాయకులు, మాలి గేవర్ చంద్, శాంతి లాల్, రూపం జి, మానాలాల్ జి, జిత్తు సింగ్, కనరాంజి ,భరత్ సింగ్ ,కిషోర్ కుమార్,ఈశ్వర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి గ్రామోత్సవంలక్ష మార్వాడి కుటుంబాల వారు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవన్ నుంచ/ ప్రారంభమైన ఊరేగింపు ప్రకాశం చౌక్, వెంకట రామ థియేటర్, తహసీల్దార్ కార్యాలయం , పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్, మావుళ్ళమ్మ గుడి వీధి మీదుగా చాంబర్‌కు చేరుకుంది.

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ఉండాలి

భీమవరం అర్బన్: సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగియుండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. రాయలం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నాగు ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో భాగంగా శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీర్వదనమును ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఉభయగోదావరి జిల్లా సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయుడు, నాగన్న, పంచదార శ్రీను, అడబాల అర్జునరావు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో...

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా సాగాయి స్థానిక పెద్దింటి అమ్మవారు, వనువులమ్మ వారి దేవాలయాల్లోనూ, పలు పందిళ్లలో ఉత్సవాల్ని ముగించారు. సోమవారం రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారిని పూజించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద 18 మంది బాలలకు, 9 మంది నవ దుర్గ అమ్మలకు, ఇద్దరు మహిళలకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సూక్త లక్ష్మీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాల్ని ఆలయ కమిటీ చైర్మన్, కార్యదర్శులు గొంట్లా గణపతి, కాకర్ల రాజారాజేశ్వరిల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం శమీ పూజ చేశారు. జవహార్‌పేటలోని కనకదుర్గమ్మకు మహిళలు పెద్ద ఎత్తున జలాభిషేకం చేశారు.

దుర్గమ్మకు భవానీ మాలధారుల పూజలు

కాళ్ల: దేవీ నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా మంగళవారం దసరా ఉత్సవ కార్యక్రమాలు ముగిశాయి. మాలావానితిప్పలోని దుర్గమ్మ ఆలయంలో భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి చండీయాగం చేశారు. కార్యక్రమంలో వేగేశ్న రంగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



1991-92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

వీరవాసరం: దసరా పండుగ పురిస్కరించుకుని కొణితివాడ హైస్కూల్లో 1991 - 92 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమ్మేళన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులకు విద్య నేర్పిన గురువులు ఇంగ్లీష్ టీచర్ జయరాజు , తెలుగు మాస్టర్ కామశాస్త్రి , సైన్స్ టీచర్ నరసింహారాజు, తెలుగు టీచర్ శర్మలను సత్కరించారు. ముందుగా మృతి చెందిన గురువులకు, తోటి విద్యార్థులకు సంతాపం తెలిపారు. అనంతరం విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో హోదా స్థితిగతులు గురువులకు తోటి విద్యార్థులకు తమ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో వెలక్కాయల పార్థసారథి, నాగరాజు సుబ్బరాజు, చిక్కాల రవికుమార్, కురిశెట్టి శేషు, ఆనందం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ రిజర్వు పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ



సాయుధ రిజర్వు పోలీస్ కార్యాలయంలో పూజలు చేస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: పట్టణంలోని జిల్లా సాయుధ రిజర్వు పోలీస్ కార్యాలయంలో మంగళవారం విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. ఏఆర్ అధికారులు, సిబ్బంది, ఇతర పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు అడిషినల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయంలోని దుర్గామాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుబ్బరాజు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో పోలీసు యంత్రాంగం, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్ డీసీఆర్బీ ఎస్ఐ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 8 ఫిర్యాదులు

భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 8 ఫిర్యాదులందాయి. ఎస్పీ యు.రవిప్రకాష్, ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం స్పందన ఫిర్యాదులను సత్వరమే చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ రవిప్రకాష్ ఫోన్‌లో ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ బల్క్‌మిల్క్ సెంటర్లు



మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పాడి పరిశ్రమ రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ బల్క్‌మిల్క్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. సోమవారం రాజామిల్క్ సెంటర్ కొప్పర్రులో ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాలశీతలీకరణ కేంద్రాలను ప్రోత్సహిస్తూనే ప్రభుత్వ రంగంలో కూడా వీటిని అందుబాటులోకి తెస్తుందని ఆయన అన్నారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడంతో పాటు పాల విక్రయానికి ఇబ్బందిలేకుండా పాడి రైతులకోసం ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరిస్తుందన్నారు. కొప్పర్రులో అతి త్వరలోనే పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రభుత్వపరంగా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమలో మున్సిపల్‌చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైద్యుడు చినమిల్లి సత్యనారాయణ, గుడివాడ ప్రభాకరరావు, సర్పంచ్ మేరీ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాలకు బహిరంగ వేలం

తణుకు: తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్లకు ఈనెల 26న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తణుకు రూరల్ పోలీసులు తెలిపారు. సంబంధిత మోటారు సైకిళ్ల యజమానులు వాటిని తీసుకెళ్లేందుకు ముందుకు రాకపోవడంతో వాటిని ఈనెల 26న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా పోలీసు స్టేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్టుకు నిప్పు



మంటలను అదుపు చేయడానికి వచ్చిన ఫైర్ సిబ్బంది

సాక్షి, భీమవరం: స్థానిక తాలూకాఫీసు సెంటర్‌లోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చెట్టుకు నిప్పంటుకోవడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ఈ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు ట్రెజరీ, సబ్‌రిజిస్ట్రార్, కోర్టు వంటివి ఉన్నాయి. ఆ పక్కనే ఖాళీస్థలం ఉండడంతో అందులో చెట్లు పెరిగాయి. అయితే ఎంతోకాలంగా ఒక చెట్టు ఎండిపోయి ఉండడంతో ఎప్పుడు ఎవరిపై పడుతుందోనని భయపడేవారు. అయితే ఎండి చెట్టు ప్రాంతంలో చెత్తకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో అది కాస్తా ఎండిన చెట్టుకు అంటుకుని మంటలు రేగాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ వై.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ అక్కడకు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పివేశారు. అలాగే గునుపూడి ప్రాంతంలోని బేతనీపేట వద్ద చెత్తకు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. ఆ మంటలను కూడా అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు.

ఉండిలో శివ వనం ప్రారంభం



శివవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఉండి విజయదశమి పర్వదినాన ఉండిలోని పార్వతీసమేత చెన్నమల్లేశ్వరస్వామి, స్వయంభూ మహిషాసురమర్దని అమ్మవారి ఆలయ ఉత్తర భాగాన శివునికి ఇష్టమైన పవిత్ర మొక్కలతో శివ వనాన్ని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, వేదా సీడ్స్ ఎండీ డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, నక్షత్ర హోమం, నవగ్రహ హోమం, దుర్గాహోమం, రుద్రహోమం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ముషిడి, ఉసిరి, మేడి, నేరుడు, కాచు, పిప్పలు, వెదురు, రావి, నాగకేసరి, మర్రి, మోదుగ, జాతిజువ్వి, మారేడు, నల్లమద్ది, వెలగ, పొగడ, దేవదారు, అశోక, పనస, ఎర్రజిల్లేడు, కదంబ, వేప, మామిడి, ఇప్ప, దర్భగడ్డి, గరికగడ్డి, జమ్మిచెట్టు, ఉత్తరేణి, తెల్లజిల్లేడు వంటి 41 రకాల పవిత్రమైన మొక్కలను శివవనంలో నాటారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మన,సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అయినంపూడి రామకృష్ణంరాజు, సభ్యుడు శేషాద్రి శ్రీను, మండా రత్నమాణిక్యం, మంతెన వెంకట్రాజు, ముద్రపల్లి విజయలక్ష్మీ, ఆకుల సుబ్బలక్ష్మీ పాల్గొన్నారు.

పోలియోపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: పోలియో మహమ్మారిని నిర్మూలించడమే రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహనరావు అన్నారు. మంగళవారం వరల్డ్ పోలియో డే సందర్భంగా పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో మాత్రమే పోలియో ఎనిమిది కేసులు బయటపడ్డాయన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల ప్రదీప్, రోటరీ గవర్నర్ యిమ్మిడి రాజేష్, మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, చందక రాము, ముత్యాల శ్రీనివాసరావు, పీర్‌సాహెబ్, కఠారి నాగేంద్ర కుమార్, ముచ్చర్ల సంజయ్, కానూరి ప్రభాకరరావు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగన్‌నే కోరుకుంటున్నారు

పెనుగొండ: రాష్ట్రంలో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. మంగళవారం ఆచంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆనందప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పెట్టి సముపాళ్లలో పెట్టిన సీఎం జగన్‌కే ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మట్టా ఆనందకుమార్, నాయకులు వేదాల నాగరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధం

పోడూరు: మండలంలోని జగన్నాథపురం శివారు పప్పుగుంట గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో దిద్దే నిర్మల ప్రభావతికి చెందిన పెంకుటిల్లు దగ్ధమైంది. ప్రభావతి రెండురోజుల కిందట కుమార్తె ఇంటికి వెళ్లడంతో ప్రమాద సమయంలో ఆమె ఇంట్లో లేదు. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారంతో పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. ప్రమాదంలో దాదాపుగా రూ.50 వేల ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

మావూరమ్మ ఆలయానికి ఏసీ అందజేత

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బంగారువారి చెరువు గట్టులో ఉన్న శ్రీ మావూరమ్మ ఆలయానికి మద్దుల వీర వెంకట సుబ్రహ్మణ్యం-స్వరూప దంపతులు రూ.42 వేలు విలువైన ఎయిర్ కూలర్ వితరణ చేశారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శంకరాపు శ్రీనివాసరావు, సభ్యులు రౌతు అచ్యుతరావు, యందం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికులసమస్యల పరిష్కారం కోసం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, ఆచంట, పెనుగొండ, యలమంచిలి పరసర ప్రాంతాల వారు ఆర్టీసీ సర్వీస్‌లు, కార్గో సర్వీస్‌లు, కార్గో సేవలు డోర్ డెలివరీలు తదితర అంశాలపై సమస్యలున్నా, ఎలాంటి సలహాలు, సూచనలు చేయాలనుకున్నా ఈ కార్యక్రమానికి ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని సూచించారు.